

## బ్యాంకులో రైతుల నిరసన

తమ అకౌంట్లో ఉన్న డబ్బులను బ్యాంక్ అధికారులు హోల్డ్‌లో పెట్టారని ముగ్గురు రైతులు నిరసన చేపట్టారు.స్థానిక ధనలక్ష్మి లాడ్జి వద్ద గల ఎస్బీఐలో ఆందోళనకు దిగారు. 8లో▸



## యథేచ్ఛగా మొరం తవ్వకాలు

జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో మొరం అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. పొక్లెయిన్ల సాయంతో టిప్పర్లలో తరలిస్తున్నారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
35.0/19.0

## వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. గాలిలో తేమశాతం తగ్గనుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరగడంతో ఉక్కపోత ప్రభావం కనిపించనుంది.

## న్యూస్‌రీల్

### సీఎంను కలిసిన డీసీసీబీ చైర్మన్



సీఎం రేవంత్‌రెడ్డితో భోజారెడ్డి

కైలాస్‌నగర్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. టెస్కాబ్ చైర్మన్‌తో పాటు రాష్ట్రంలోని ఆయా సహకార బ్యాంకుల చైర్మన్లతో కలిసి హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాయంలో సీఎంను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. తమ పదవీ కాలం మరో ఆరునెలల పాటు పొడిగింపుపై హర్షం వ్యక్తం చేస్తూ సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో సాంకేతిక కారణాలతో రుణమాఫీ కాని రైతుల రుణాలు మాఫీ చేసేలా చూడాలని విన్నవించగా, సీఎం సానుకూలత వ్యక్తం చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

### ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలి




సైన్స్‌ఫేర్‌ను ప్రారంభిస్తున్న అదనపు ఎస్పీ

తాంసి: విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలని అదనపు ఎస్పీ సురేందర్ రావు అన్నారు. జాతీయ సైన్స్‌డే పురస్కరించుకుని మండలంలోని కప్పర్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం సైన్స్‌ఫేర్ ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎగ్జిబిట్లను సందర్శించి విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని వారికి సూచించారు. కార్యక్రమంలో ఎస్సై రాధిక, ప్రధానోపాధ్యాయుడు ఆనంద్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

### ‘ప్రజా సమస్యలపై ఉద్యమిస్తాం’

ఎదులాపురం: ఎన్నికల కోడ్ అనంతరం ప్రజా సమస్యలపై ఉద్యమిస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం జిల్లాకు తీరని అన్యాయం చేసిందన్నారు. ఆర్మూర్–ఆదిలాబాద్ రైల్వేలైన్, విమానాశ్రయం ఏర్పాటు, సిమెంట్ ఫ్యాక్టరీ తెరిపించడం వంటి ప్రధాన హామీలతో జిల్లా వాసులను ఏళ్లుగా మోసం చేస్తోందని విమర్శించారు. ఎన్నికల కోడ్ అనంతరం ఆయా సమస్యలపై పోరాటాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు రాములు, అరుణ్‌కుమార్, నర్సింగ్‌రావు, మహబూబ్ ఖాన్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

### కంది రైతుల ఆందోళన



రైతులను సముదాయిస్తున్న ఎస్సై

బేల: మండల కేంద్రంలోని సబ్ మార్కెట్ యార్డులో కందుల కొనుగోళ్లు చేపట్టకపోవడంతో రైతులు ఆందోళన చేపట్టారు. జాతీయ రహదారిపై బైఠాయించారు. కందుల కొనుగోళ్లు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న ఎస్సై దివ్యభారతి అక్కడికి చేరుకుని మార్కెట్ అధికారులతో మాట్లాడారు. అలాగే సమస్య పరిష్కరిస్తానని రైతులను సముదాయించడంతో వారు వెనుదిరిగారు.

### విద్యార్థినుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

ఇంద్రవెల్లి: ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థినుల ఆరోగ్యంపై వైద్యఆరోగ్య శాఖ ప్రత్యేక దృష్టి సారిస్తుందని ఏజెన్సీ అదనపు వైద్యాధికారి కుడ్మెత మనోహర్ అన్నారు. మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాలలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. మొత్తం 100 మంది విద్యార్థినుల రక్త నమూనాలు సేకరించారు. విద్యార్థినులకు వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యులు పూజిత, సీహెచ్‌వో సందీప్, పీహెచ్‌ఎన్ జ్యోతి, హెల్త్ సూపర్‌వైజర్ నరేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



స్వయం సహాయక సంఘ సభ్యులతో సమావేశం (ఫైల్)

# లక్ష్యం..అధిగమించి

- ఎస్‌హెచ్‌జీలకు విరివిగా స్త్రీనిధి రుణాలు
- ‘బ్యాంకు లింకేజీ’ కూడా 98 శాతం పూర్తి
- అతివలకు అండగా నిలుస్తున్న మెప్మా
- మహిళల ఆర్థికాభివృద్ధికి చేయూత

| పట్టణంలోని సంఘాలు, రుణాల ప్రగతి వివరాలు |
|---|
| మొత్తం వార్డులు: 49 |
| జనాభా : 155747 |
| స్వయం సహాయక సంఘాలు: 2,536 |
| అందులోని సభ్యులు: 25,722 |
| మొత్తం రుణలక్ష్యం : రూ.26.36 కోట్లు |
| ఇప్పటివరకు అందించిన రుణాలు:రూ.26.37కోట్లు |

కైలాస్‌నగర్: మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తోంది. ప్రధానంగా బ్యాంకుల ద్వారా సబ్సిడీ రుణాలతో పాటు స్త్రీ నిధి ద్వారా ఆర్థికసాయం అందజేస్తూ వారికి అండగా నిలుస్తోంది. ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను నిర్దేశించిన రుణ లక్ష్యాలను వంద శాతం సాధించే దిశగా మెప్మా ముందుకు సాగుతోంది. స్వయం సహాయక సంఘాల్లోని మహిళలను చైతన్యపరుస్తూ ఇప్పటికే స్త్రీ నిధి రుణాలను లక్ష్యానికి మించి అందజేశారు. అలాగే బ్యాంకు లింకేజీ రుణ లక్ష్యాన్ని 98శాతం సాధించారు. ఆర్థిక సంవత్సరం ముగింపునకు మరో 40 రోజుల గడువు ఉండటంతో దానిని కూడా త్వరలోనే అధిగమించేలా కృషి చేస్తున్నారు.

**బ్యాంకు లింకేజీ రుణాలిలా..**

బ్యాంకు లింకేజీ ద్వారా పట్టణంలోని 330 సంఘాలకు రూ.19కోట్ల 91లక్షల 15వేల రుణాలు అందించాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఇప్పటి వరకు 177 సంఘాలకు గాను రూ.19కోట్ల 67లక్షల 14వేల రుణాలు అందజేశారు.98.79శాతం లక్ష్యాన్ని సాధించగా ఇంకా సమయం ఉన్నందున వీటి ప్రగతి కూడా వందశాతానికి మించి నమోదయ్యే అవకాశం కనిపిస్తోంది. అలాగే స్వయం ఉపాధి కార్యక్రమం (సెప్–1) కింద రూ.50వేల నుంచి రూ.లక్ష వరకు సభ్యులకు ఆర్థిక చేయూతనందించాలని నిర్ణయించారు. దీని కింద 24 యూనిట్లను లక్ష్యంగా నిర్దేశించుకోగా ఇప్పటి వరకు 25 యూనిట్లకు రుణాలు అందజేసి అందులోని వంద శాతం మించి ప్రగతిని సాధించారు.

స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ అండగా నిలుస్తోంది. బ్యాంకుల ద్వారా విరివిగా రుణాలు అందజేస్తూ వారు ఆర్థికంగా ఎదిగేలా ప్రోత్సహిస్తోంది. 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను స్త్రీ నిధి రుణ లక్ష్యం రూ.6 కోట్ల 28 లక్షల 64వేలు ఉండగా ఇప్పటి వరకు రూ. 6 కోట్ల 52లక్షల 23వేలను అందించారు. లక్ష్యానికి మించి 103 శాతం రుణాలు అందజేశారు. ఆర్థిక సంవత్సరం ముగిసే లోపు 150 శాతం వరకు చేరుకుంటామని మెప్మా అధికారులు చెబుతున్నారు.

**స్త్రీనిధి రుణాలు.. 103 శాతం**

**మహిళాశక్తిలో తడబాటు...**

బ్యాంకు లింకేజీ, స్త్రీ నిధికి సంబంధించి వందశాతం రుణాలు అందజేస్తూ ఆదర్శంగా నిలిచిన మెప్మా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో మాత్రం తడబాటుకు గురవుతోంది. ఈ పథకం కింద వ్యక్తిగత రుణాలు 144మందికి అందించాలని లక్ష్యంగా నిర్ణయించగా ఇప్పటి వరకు 96 మందికి మాత్రమే అందజేశారు. మరో 48 యూనిట్లను సాధించాల్సి ఉంది. అలాగే గ్రూపులకు 25 యూనిట్లకు రుణాలు అందించాల్సి ఉండగా 18 యూనిట్లకు అందజేసి వివిధ వ్యాపారాలు ప్రారంభించేలా చర్యలు చేపట్టారు. మరో ఏడు యూనిట్లను సాధించాల్సి ఉంది. అయితే ఇంకా సమయం ఉన్నందున వీటిని కూడా వందశాతం సాధించాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నారు. ఆసక్తిగల మహిళలను ఎంపిక చేసి వారికి రుణాలందించేలా శ్రద్ధ వహిస్తున్నారు. తద్వారా మహిళా శక్తి క్యాంటీన్ నిర్వహణతో పాటు టైలరింగ్, సెంట్రింగ్ వంటి తదితర వ్యాపారాలు ప్రారంభించేలా చొరవ చూపుతున్నారు.

### పకడ్బందీ ప్రణాళికతోనే లక్ష్యసాధన



ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచే రుణ లక్ష్యాలను సాధించే దిశగా ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేశాం. పట్టణంలోని ప్రతీ వార్డులో ఎస్‌ఎల్‌ఎఫ్‌లతో సమావేశాలు నిర్వహించి బ్యాంకు లింకేజీకి అర్హులైన ఎస్‌హెచ్‌జీల సమాచారం సేకరించాం. ఏదైనా యూనిట్ ఏర్పాటు చేయాలనుకునే వారికి అత్యవసరమైన రుణాలను సీసీఎల్ కింద అందజేశాం. టీజీబీ, యూబీఐ బ్యాంకుల ఆధ్వర్యంలో ప్రతి నెలలో లాగిన్ డే నిర్వహించి బ్యాంకులిచ్చిన సమాచారం ప్రకారం ఎన్ని ఎస్‌హెచ్‌జీలు రికవరీకి ఉన్నాయి.. రుణాల చెల్లింపు ఎంత పూర్తయిందనే వివరాలు తెలుసుకుని లింకేజీ రుణాలు ఇప్పించాం. వారం రోజుల్లోనే వారి ఖాతాల్లో జమయ్యేలా చర్యలు చేపట్టాం. ఫలింగానే వందశాతం రుణా లక్ష్యాలను సాధించాం.

– శ్రీనివాస్, డీఎంసీ, మెప్మా

# పంటల లెక్క.. ఇక పక్కా

- పకడ్బందీగా డిజిటల్ క్రాప్ సర్వే
- క్షేత్రస్థాయిలో వివరాలు నమోదు చేస్తున్న ఏఈవోలు
- నివేదిక ఆధారంగా పంట దిగుబడి కొనుగోళ్లు



సర్వే నిర్వహిస్తున్న ఏఈవో శ్యాంసుందర్

బోథ్: పంటల లెక్క పక్కాగా తేల్చేందుకే ప్రభుత్వం ఈ నెల 3న డిజిటల్ క్రాప్ సర్వేకు శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం జిల్లాలోని 101 క్లస్టర్లలో వ్యవసాయ విస్తరణ అధికారులు రైతుల చేలల్లోకి వెళ్లి సర్వే నిర్వహిస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తయితే ఆయా పంటల సాగు వివరాలు పక్కాగా తేలనున్నాయి. వీటి ఆధారంగానే రైతుల పంట దిగుబడులను ప్రభుత్వం కొనుగోలు చేసే అవకాశం ఉంటుంది. ఏఈవోలు తమ క్లస్టర్ పరిధిలో 18వందల నుంచి 2వేల ఎకరాల వరకు సర్వే చేపట్టాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

**సర్వే ఇలా..**

ఈ సర్వే నిర్వహణకు గాను ప్రభుత్వం ప్రత్యేకంగా ఓ యాప్‌ను రూపొందించింది. ఇందులో భాగంగా ఏఈవోలు రైతుల చేల వద్దకు వెళ్తున్నారు. పంటల సాగు విస్తీర్ణం వివరాలను అందులో నమోదు చేస్తున్నారు. సర్వేనంబర్ ఎంట్రీ చేయగానే ఆ పరిధిలో ఉన్న రైతుల వివరాలు కనిపిస్తాయి. కావాల్సిన రైతు పేరు ఎంచుకోగానే వారి పేరిట ఉన్న భూమి వివరాలు దర్శనమిస్తాయి. అందులో రైతు ఏ పంట ఎంత విస్తీర్ణంలో సాగు చేస్తున్నాడో నమోదు చేయాలి. అలాగే సాగు ఫొటోను యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ఒకవేళ సాగులో లేని భూమి ఉంటే వాటిని నాన్‌క్రాప్ కింద నమోదు చేస్తున్నారు.

**పంటల నమోదు ఆధారంగానే కొనుగోళ్లు..**

ఈ సర్వేతో రైతులు సాగు చేసే పంటల వివరాలు పక్కాగా తేలనున్నాయి. తదనుగుణంగా వచ్చే దిగుబడిని మార్కెట్‌లో ప్రభుత్వ రంగ సంస్థకు మద్దతు ధరతో విక్రయించేందుకు అవకాశం ఉంటుంది.

**పలు చోట్ల ఇబ్బందులు..**

సర్వేలో భాగంగా ఏఈవోలకు పలు సమస్యలు ఎదురవుతున్నాయి. కొన్నిచోట్ల ఇంటర్‌నెట్ సౌకర్యం అందుబాటులో లేకపోవటంతో యాప్ ఓపెన్ కావడం లేదు. అలాగే పలు చోట్ల సర్వర్ నెమ్మదించటం, మరికొన్ని చోట్ల రైతుల చేలల్లో లొకేషన్ తప్పుగా చూపించడం, సర్వే నంబర్లు కనిపించకపోవడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయని ఏఈవోలు చెబుతున్నారు.

### సర్వేతో పక్కాగా సాగు లెక్క



జిల్లాలో డిజిటల్ క్రాప్ సర్వే కొనసాగుతోంది. ఇందులో భాగంగా ఏఈవోలు రైతుల చేలల్లోకి వెళ్లి పంటల సాగు వివరాలు అక్కడే నమోదు చేస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తయితే జిల్లా వ్యాప్తంగా రైతులు ఏయే పంటలు, ఎంత విస్తీర్ణంలో సాగు చేస్తున్నారో లెక్కలు పక్కాగా రానున్నాయి.

– శ్రీధర్ స్వామి, జిల్లా వ్యవసాయాధికారి

### మేడారం సమ్మక్కను దర్శించుకున్న ఎంపీ



సమ్మక్కను దర్శించుకుంటున్న ఎంపీ గోడం నగేశ్

ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ మంగళవారం మేడారంలో సమ్మక్క–సారలమ్మలను దర్శించుకున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా ములుగు జిల్లాకు ప్రచారానికి వెళ్లిన ఆయన మేడారంలోని అమ్మవార్లను గద్దెల వద్ద దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆయన వెంట ఎమ్మెల్సీ అభ్యర్థి సర్వోత్తంరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

– ఇచ్చోడ

# 24న సేవాలాల్ జయంతి వేడుకలు



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా, పక్కన ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా తదితరులు

- కలెక్టర్ రాజర్షి షా

కైలాస్‌నగర్: బంజారాల ఆరాధ్యదైవం శ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలను ఈ నెల 24న పట్టణంలోని రాంలీలా మైదానంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. వేడుకల నిర్వహణ ఏర్పాట్లపై కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉత్సవ కమిటీ సభ్యులు, వివిధ శాఖల అధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల కోడ్ నిబంధనలు అనుసరించి వేడుకలు నిర్వహించాలన్నారు. హాజరయ్యే వారికి ఆర్టీసీ బస్ సౌకర్యం కల్పించాలని, విద్యుత్ శాఖ ద్వారా నిరంతర కరెంట్ సరఫరా చేయాలన్నారు. అలాగే మున్సిపల్ ద్వారా రెండు రోజుల ముందు నుంచే శానిటేషన్ పనులు చేపట్టాలన్నారు. పంచాయతీ శాఖ ద్వారా ట్యాంకర్లు ఏర్పాటు చేయాలని, మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సౌకర్యం, వైద్య శాఖ ద్వారా మెడికల్ క్యాంప్, పోలీస్ శాఖ ద్వారా బారికేడ్లు, బందోబస్తు, పార్కింగ్ ప్రాంతాలు వంటి ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, డీఎస్పీ ఎల్. జీవన్‌రెడ్డి, ఆర్డీవో వినోద్‌కుమార్, బంజారా ఉత్సవ కమిటీ చైర్మన్ భీమ్‌రావ్, ఐటీడీఏ డీడీ వసంత్‌రావు, డీఆర్డీవో రవీందర్ రాథోడ్, ఉత్సవ కమిటీ సభ్యులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

**టీబీ రోగులకు పౌష్టికాహార కిట్లు**

క్షయ రోగులకు పోషకాహార కిట్లు అందించేందుకు గ్లాండ్ ఫార్మా అనే కంపెనీ ముందుకు వచ్చింది. ఈ మేరకు కంపెనీ ప్రతినిధులతో కలిసి డబ్ల్యూహెచ్‌ఓ ప్రతినిధి డా.స్నేహ శుక్లా మంగళవారం కలెక్టర్ రాజర్షి షాను తన క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఇటీవల చేపట్టిన వంద రోజుల ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 1,332 మంది క్షయ వ్యాధిగ్రస్తులు ఉన్నట్లుగా గుర్తించారు. వారందరికీ ఆరు నెలల పాటు పోషకాహార కిట్లను ఆ కంపెనీ ద్వారా అందించనున్నట్లుగా కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్, జిల్లా క్షయ నియంత్రణాధికారి సుమలత తదితరులున్నారు.

### ముందస్తు చర్యలు చేపట్టాలి

కైలాస్‌నగర్: రానున్న వేసవి దృష్ట్యా జిల్లాలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మంగళవారం జిల్లా కలెక్టర్లతో హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొన్నారు. అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. 97 హ్యాబిటేషన్లలో తాగునీటి ఇక్కట్లు గుర్తించి బోరు బావులు, బావులు, పైపులైన్ల మరమ్మతులు చేపట్టాలన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి ఎక్కడెక్కడ సమస్యలు ఉన్నాయనే దానిపై నివేదిక అందజేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారిని ఆదేశించారు. ముఖ్యంగా ఇంద్రవెల్లి, గాదిగూడ, ఉట్నూర్, ఆదిలాబాద్ రూరల్ మండలాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. తాగునీటి వనరుల్లో క్లోరినేషన్ చేయాలని సూచించారు. నీటి సమస్య ఎక్కువగా ఉన్న చోట ట్యాంకర్లతో సరఫరా చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, ట్రెయినీ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియా, ఆర్డీవో వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ముస్లింలను బీసీల్లో చేరిస్తే స్పందించరా?

- కేంద్రం నిధులపై చర్చకు సిద్ధమా?
- కేంద్ర మంత్రి బండి సంజయ్
- మంచిర్యాలలో పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనం



మాట్లాడుతున్న కేంద్రమంత్రి బండి సంజయ్, పక్కన ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి

సాక్షిప్రతినిధి, మంచిర్యాల/మంచిర్యాలటౌన్: ‘బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అని చెప్పి.. 10 శాతం ముస్లింలను కలిపితే బీసీలకు అన్యాయం జరిగినట్లు కాదా.. కాంగ్రెస్ నేతలు స్పందించరా..? బీసీల్లో ముస్లింలను కలిపితే కేంద్రం ఆమోదించే ప్రసక్తే లేదు. ..’ అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు. ‘రంజాన్‌కు ముస్లిం ఉద్యోగులందరికీ సాయంత్రం 4గంటలలోపే విధులు ముగించుకుని వెళ్లిపోవచ్చని మినహాయింపు ఇచ్చారు. అయ్యప్ప, హనుమాన్, భవానీ భక్తులు ఏం పాపం చేశారని.. కాంగ్రెస్‌లోని హిందువులారా.. మీలో నిజంగా హిందూ రక్తమే ప్రవహిస్తే సమాధానం చెప్పాలి..’అంటూ డిమాండ్ చేశారు. మంగళవారం మంచిర్యాల పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ మాట్లాడారు. అంతకు ముందు పట్టణంలో కార్యకర్తలు, నాయకులతో బైక్ ర్యాలీ నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యేలు కే.వెంకటరమణారెడ్డి, పాల్వాయి హరీశ్‌బాబు, ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సంజయ్ మాట్లాడుతూ.. మూడుస్థానాల్లో బీజేపీ గెలుపు ఖాయమని ఏ సర్వే చూసినా స్పష్టం చేస్తున్నాయని అన్నారు. కేంద్రం రూ.12.75లక్షల ట్యాక్స్ మినహాయింపు, పదేళ్లలో రూ.12 లక్షల కోట్లకుపైగా నిధులను తెలంగాణకు ఇచ్చిందన్నారు. కేంద్రం నిధులివ్వడం లేదని ఆరోపణలు చేస్తున్న కాంగ్రెస్ బహిరంగ చర్చకు సిద్ధమా..? ఈ అంశాన్ని రెఫరెండంగా తీసుకుని ఎమ్మెల్సీ ఎన్నికల్లోకి రావాలని కాంగ్రెస్‌కు సవాల్ విసిరారు. కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించాలనే ఆలోచనే ఆ పార్టీ ఎమ్మెల్యేలకు లేదన్నారు. సొంత కాలేజీ స్టాఫ్‌ను పట్టుకుని తిరుగుతున్నారని విమర్శించారు.

**మంచిర్యాలలో దాదాగిరి**

మంచిర్యాలలో కొందరు దాదాగిరి చేస్తున్నారని, ఆరు నెలల కంటే ఎక్కువ కాంగ్రెస్ ప్రభుత్వం ఉండే పరిస్థితి లేదని కేంద్రమంత్రి సంజయ్ అన్నారు. ప్రభుత్వంలో టాప్ 5లో ఉన్న వాళ్ల దోపిడీ, అవినీతికి అడ్డూ అదుపు లేకుండా పోతోందని, కమీషన్లకు కక్కుర్తిపడుతున్నారని విమర్శించారు. అవినీతి జరుగుతుందడానికి సీఎం వ్యాఖ్యలే నిదర్శనమన్నారు. 15శాతం కమీషన్లు ఇస్తే మాత్రం కాంట్రాక్టర్లకు అప్పటికప్పుడు బిల్లులు క్లియర్ చేస్తున్నారని ఆరోపించారు. ప్రధాని మోదీ బీసీ కాదని ఆయన కులం గురించి అవాకులు పేలుతున్నారని, రాహుల్ ఖాన్ గాంధీ తండ్రి పేరు ఏమిటి? ఫిరోజ్‌ఖాన్ గాంధీ...అసలు గాంధీ అని పేరు యాడ్ చేసుకుని గాంధీ పరువు తీస్తున్నారని విమర్శించారు. మహాత్మాగాంధీ ఆత్మ బాధపడుతోందని, ఫిరోజ్‌ఖాన్ గాంధీ కొడుకు, మనవడు ఏమైతరు? హిందువులైతే కానే కాదన్నారు. మీరు హిందువులేనా? మీలో హిందువు రక్తం ప్రవహిస్తుందా? అని ప్రశ్నించారు. నిరుద్యోగులు, ఉద్యోగుల పక్షాన పోరాడింది తామే అని, నిరుద్యోగులకు మోచేతికి బెల్లం రాసి నాకిచ్చినంత పనిచేశారని అన్నారు. 2లక్షలకుపైగా ఖాళీలు ఉన్నాయని, ఓట్లకోసం వచ్చే కాంగ్రెస్ నేతలను గల్లా పట్టి నిలదీయాలని అన్నారు. కోడ్ లేని జిల్లాల్లో వెంటనే కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలని సీఎం ఆదేశించారు.. అబద్ధాలు చెప్పి మోసం చేసి ఓట్లు దండుకోవడంలో కాంగ్రెసోళ్లు కేసీఆర్‌ను మించి పోయిర్రని తెలిపారు. ఇవన్నీ ప్రశ్నిస్తే హిందూ ముద్ర వేస్తున్నారన్నారు. కాళేశ్వరం, డ్రగ్స్ కేసు, ఫార్ములా ఈ రేస్ స్కాం కేసులో ఇదిగో అరెస్ట్...అదిగో అరెస్ట్ అంటూ మీడియాలో వార్తలు రాయించుకుంటూ కాలయాపన చేయడం తప్ప కాంగ్రెస్ సాధించిందేమిటి అని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ స్కాంలు ఢిల్లీలోని కాంగ్రెస్ నేతలకు ఏటీఎంలాగా మారాయని, ఒక్కో స్కాం ఢిల్లీ పెద్దలకు రూ.వెయ్యి కోట్లకుపైగా పైసలు దండుకుంటున్నారని అన్నారు.

# హీరాసుక జయంతి విజయవంతం చేయండి

ఆదిలాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని రాంలీలా మైదానంలో ఈ నెల 23న నిర్వహించనున్న హీరాసుక జయంతిని ఉమ్మడి జిల్లా ఆదివాసీ పర్ధాన్ సమాజ్ కులస్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఆదివాసీ పర్ధాన్ సమాజ్ జాతీయ నాయకుడు సిడాం రాంకిషన్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మెస్రం శంకర్ పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదుట గల హీరాసుక దేవస్థాన మందిరం ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పూసం ఆనంద్‌రావ్, సెడ్మకి సుభాష్, గేడం మాధవ్, ప్రకాశ్, రామాకాంత్ తదితరులున్నారు.

ఇంద్రవెల్లి: జిల్లా కేంద్రంలోని రాంలీలా మైదానంలో నిర్వహించే హీరాసుక జయంతికి భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పర్ధాన్‌గూడ పటేల్ గేడం జ్ఞానేశ్వర్, పర్ధాన్ సమాజ్ మండల అధ్యక్షుడు గేడం భరత్ కోరారు. మండలకేంద్రంలోని పర్ధాన్‌గూడలో ఆయా గ్రామాల సమాజ్ పెద్దలతో మంగళవారం సమావేశమయ్యారు. ఇందులో నాయకులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### ఇద్దరు ఆటోడ్రైవర్లకు ఆరునెలల జైలు

**లక్ష్మణచాంద:** రోడ్డు ప్రమాదానికి కారణమైన ఇద్దరు ఆటోడ్రైవర్లకు ఆరునెలల జైలుశిక్షతోపాటు ఒక్కొక్కరికి రూ.500 జరిమానా విధిస్తూ నిర్మల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఆర్.అజయ్‌కుమార్ మంగళవారం తీర్పునిచ్చారు. ఎస్సై సుమలత కథనం ప్రకారం.. 2016 నవంబర్ 23న మండలంలోని వడ్యాల్ శివారులోని సరస్వతి కెనాల్ బ్రిడ్జి వద్ద ఎదురెదురుగా రెండు ఆటోలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో వడ్యాల్‌కు చెందిన బొచ్చు రాజవ్వ, లక్ష్మణచాంద గ్రామానికి చెందిన నిమ్మల గోదావరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదంపై లక్ష్మణచాంద పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. అడిషనల్ పీపీ దేవేందర్ సాక్షులను ప్రవేశపెట్టి కేసు రుజువు చేశారు. ప్రమాదానికి కారణమైన ఇద్దరు ఆటోడ్రైవర్లు షేక్ ఇమ్రాన్, షేక్ సోఫీలకు జైలుశిక్షతోపాటు జరిమానా విధిస్తూ మేజిస్ట్రేట్ తీర్పుచెప్పారు.

### బైక్ చోరీ

**ఆదిలాబాద్‌టౌన్:** పట్టణంలోని తాటిగూడకు చెందిన షేక్ ఆయుబ్ బైక్ చోరీకి గురైంది. ఈనెల 12న ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో సాయంత్రం వాకింగ్ కోసం వెళ్లాడు. స్టేడియంలో పార్కింగ్ చేసి గంట తర్వాత తిరిగి వచ్చేసరికి బైక్ కనిపించలేదు. చుట్టుపక్కల గాలించినా దొరకలేదు. మంగళవారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై సయ్యద్ ఇసాక్ ఆలీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### తాళం వేసిన ఇంట్లో చోరీ

**లక్సెట్టిపేట:** మున్సిపాలిటీ పరిధిలోని ఇటిక్యాల గ్రామంలో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. ఎస్సై సతీశ్ కథనం ప్రకారం.. ఈనెల 13న కాందపు ప్రసాద్ ఇంటికి తాళం వేసి కుటుంబంతో కలిసి హైదరాబాద్ వెళ్లారు. మంగళవారం తిరిగి వచ్చేసరికి తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి బీరువా చూడగా గుర్తుతెలియని వ్యక్తులు బంగారు చెవికమ్మలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. సోమవారం రాత్రి గ్రామానికి చెందిన వేముల రామయ్య ఇంట్లో తాళాన్ని పగులగొట్టిన దొంగలు బంగారాన్ని ఎత్తుకెళ్లారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

### ఏడుగురు విద్యార్థులపై కేసు



ఉపాధ్యాయులను విచారిస్తున్న ఏసీపీ

**చెన్నూర్:** చెన్నూర్ మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల విద్యార్థి మనోజ్‌పై దాడి చేసిన ఏడుగురు విద్యార్థులపై కేసు నమోదు చేసినట్లు సీఐ రవీందర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఈనెల 6న బీసీ గురుకుల పాఠశాలలో చదువుతున్న నస్పూర్ గ్రామంలోని ఇందారం కాలనీకి చెందిన విద్యార్థి పులి మనోజ్‌పై తోటి విద్యార్థులు దాడి చేసి వీడియో చిత్రీకరించి ఇన్‌స్టాగ్రాంలో పోస్ట్ చేశారని బాధిత విద్యార్థి తండ్రి రాజేందర్‌గౌడ్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రఘునాథ్, విజయ్, యువరాజ్, రజనీకాంత్, మణికంఠ, సన్నీ, సిద్ధూపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. ఈ ఘటనలో ప్రిన్సిపాల్‌ను విధుల నుంచి తొలగించడంపై విద్యార్థులు ఆందోళనకు దిగేందుకు ప్రేరేపించిన వారిపై చర్యలు తీసుకుంటామని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం పాఠశాలను సందర్శించారు. విద్యార్థులు రోడ్డు పైకి వచ్చి ఆందోళన చేపట్టవద్దన్నారు. సమగ్ర విచారణ జరిపి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపిస్తామన్నారు. సీఐ రవీందర్, ఆర్సీవో శ్రీధర్, ఎంఈవో రాధాకృష్ణమూర్తి, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ ఉన్నారు.

# నిధుల్లేవ్.. విధులకు రారు!

- పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలనకు ఏడాది
- ఒక్కొక్కరికి మూడు నుంచి నాలుగు గ్రామాలు
- పెరిగిన పనిభారం..పర్యవేక్షణపై ప్రభావం



కోటపల్లి మండలం పార్‌పల్లిలో మూలకు చేరిన వాటర్ ట్యాంకర్

| జిల్లా | మండలాలు | పంచాయతీలు |
|---|---|---|
| ఆదిలాబాద్ | 17 | 468 |
| కుమురంభీం | 15 | 335 |
| నిర్మల్ | 18 | 396 |
| మంచిర్యాల | 16 | 311 |

**కోటపల్లి/మంచిర్యాలరూరల్(హాజీపూర్):** గ్రామ పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలన మొదలై ఏడాది ముగిసింది. ఒక్కో పంచాయతీకి ఒక్కో అధికారిని నియమించాల్సి ఉండగా..అధికారుల కొరత కారణంగా రెండు నుంచి మూడు గ్రామాలకో ప్రత్యేకాధికారిని నియమించారు. దీంతో పనిభారం పెరిగి క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ లోపించింది. పంచాయతీలతోపాటు మండల పరిషత్‌లకు జిల్లాస్థాయి అధికారులను ప్రత్యేకాధికారులుగా నియమించినా వారు పట్టించుకున్నా దాఖలాలు లేవు. సొంతశాఖల్లో పనిభారంతో పల్లెల వైపు కన్నెత్తి చూడకపోవడంతో క్షేత్రస్థాయిలో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. సమావేశాలు, సంతకాలకే పరిమితమవుతుండటంతో పాలన పడకేసింది. నిధులు లేమి, పర్యవేక్షణ లోపం, పాలన వ్యవహారాలు చూసేవారు కరవై ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. జీపీలకు ఎన్నికలు జరగకపోవడంతో ఎస్ఎఫ్‌సీ, 15వ ఆర్థిక సంఘం నిధుల మంజూరు గతేడాది నిలిచిపోయాయి. నిధుల రాక పల్లెల్లో ఆర్థిక సంక్షోభం నెలకొంటోంది.

**భారమంతా కార్యదర్శిపైనే..**

పాలకవర్గాలు లేకపోవడంతో ప్రత్యేకాధికారులు పట్టించుకోకపోవడం, నిధుల లేమితో పంచాయతీల నిర్వహణ భారం కార్యదర్శులపై పడుతోంది.

**సమస్యలు ఇవీ..**

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు రాక చిన్న పంచాయతీల్లో గతంలో కొనుగోలు చేసిన ట్రాక్టర్లు రుణ వాయిదాలు చెల్లించడం కష్టంగా మారింది.
- పల్లె ప్రకృతివనాలు, క్రీడా ప్రాంగణాలు నిర్వహణ కొరవడ్డాయి.
- గతంలో పల్లెలకు పంపిణీ చేసిన చెత్తడబ్బాలు చెడిపోయి కొత్తవి కొనలేక పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారుతోంది.
- కొన్ని పంచాయతీల్లో ట్రాక్టర్లకు డీజిల్‌కు డబ్బులు వెచ్చించలేక రోడ్లపై చెత్త దర్శనమిస్తోంది. పలుచోట్ల కార్యదర్శులు డీజిల్ కోసం అప్పులు చేస్తున్నారు.
- వీధి దీపాలు మరమ్మతుకు గురైన వాటిస్థానంలో కొత్తవి బిగించలేని పరిస్థితి.
- గ్రామాలకు భగీరథ నీరు చేరక పాత తాగునీటి పథకాల నిర్వహణ, విద్యుత్ బిల్లుల చెల్లింపు కష్టతరంగా మారింది.
- క్రీడాప్రాంగణాల్లో అమర్చిన పరికరాలు తుప్పు పడుతున్నా సరిదిద్దలేని పరిస్థితి నెలకొంది.

పారిశుధ్య నిర్వహణ నీటి సరఫరా ప్రభుత్వ పథకాల సర్వే, ట్రాక్టర్, ట్యాంకర్ల నిర్వహణ, తాగునీటి పథకాల మరమ్మతు, పైపులైన్లు లీకేజీలు, వీధి దీపాలు ఇలా పలు రకాల పనుల కోసం పలువురు కార్యదర్శులు సొంత డబ్బులను వెచ్చించాల్సి వస్తోందన్న ఆరోపణలు ఉన్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు సరిపడా విడుదల కాకపోవడంతో కష్టంగా మారింది. నిధుల కొరతతో పారిశుధ్య కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించకలేక వారితో పనిచేయించడం కష్టతరంగా మారింది. పార్‌పల్లిలో నిధుల కొరతతో వాటర్ ట్యాంకర్ నెలల తరబడి తీయకపోవడంతో మొక్కలు ఎండిపోతున్నాయి. ఇలా ఒక్క జీపీల్లో కాదు జిల్లాలోని పంచాయతీల్లో ట్రాక్టర్లు, ట్యాంకర్లపై భారం పెరిగి తీయడం లేదని కార్యదర్శులే చెబుతున్నారు.

**వేసవి గట్టెక్కేనా..**

పల్లెల్లో ముఖ్యంగా వేసవిలో తాగునీటి అవసరాలతోపాటు పారిశుధ్య నిర్వహణ ముఖ్యం. భగీరథ నీరు పల్లెలకు సక్రమంగా చేరకపోవడంతో స్థానిక వనరులపై ఆధారపడతారు. తాగునీటి పథకాల్లో నీటివనరులు లేని గ్రామాల్లో మంచినీటి కటకట తప్పదు. ట్యాంకర్లు, అద్దె బోర్లు, ఇతర ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలన్నా పంచాయతీల్లో నిధులు ఉంటేనే సాధ్యపడుతుంది. ప్రత్యేకాధికారుల పాలనలో వేసవి ఎలా గట్టెక్కుతుందోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఎండాకాలంలో వివిధ రకాల వ్యాధులు విజృంభిస్తాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకాధికారులు గ్రామాలను పట్టించుకుని తగిన చర్యలు చేపట్టాలని గ్రామీణ ప్రజలు కోరుతున్నారు.

# దారి చూపేదెవరు నాన్నా..!

- రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతి
- అంధుడైన కుమారుడికి అన్నీ ఆయనే..

**దిలావర్‌పూర్:** అంధుడైన కుమారుడికి ఆ తండ్రి అన్నీ తానై వ్యవహరించాడు. అంధుల కోటాలో ఉద్యోగం సాధించగా.. ప్రతీ రోజు వెంట ఉండి విధులకు తీసుకెళ్తూ తీసుకొచ్చేవాడు. మంగళవారం సాయంత్రం కుమారుడిని తీసుకుని ఇంటికి వెళ్తుండగా.. ద్విచక్రవాహనం రూపంలో మృత్యువు దూసుకొచ్చింది. తీవ్రంగా గాయపడిన తండ్రి చికిత్స పొందుతూ చనిపోయాడు. ఈ సంఘటన మండల కేంద్రమైన దిలావర్‌పూర్ గ్రామంలో చోటు చేసుకుంది. వివరాలిలా.. మండలంలోని నర్సాపూర్(జి) గ్రామానికి చెందిన ఎడ్దూర్ భోజన్న కుమారుడు ప్రవీణ్ రెండు నెలల క్రితం అంధుల కోటాలో దిలావర్‌పూర్ తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం సాధించాడు. దీంతో ప్రవీణ్‌ను భోజన్న ప్రతీ రోజు ఆయన వెంట ఉండి కార్యాలయానికి తీసుకొచ్చి సాయంత్రం విధుల తర్వాత తీసుకెళ్తూ ఉండేవాడు. మంగళవారం సాయంత్రం కార్యాలయ విధులు ముగిసిన తర్వాత ప్రవీణ్‌ను తీసుకుని భోజన్న బస్టాండ్‌కు నడిచి వెళ్తున్నాడు. ఈ క్రమంలో వెనుక నుంచి అతివేగంగా, అజాగ్రత్తగా వచ్చిన గుర్తుతెలియని ద్విచక్ర వాహనం భోజన్నను ఢీకొట్టింది. దీంతో భోజన్న తల, ముఖానికి తీవ్ర గాయాలయ్యాయి. ఏం జరిగిందో తెలియక పక్కనే ఉన్న ప్రవీణ్ నాన్నా ఏమైందంటూ రోదించిన తీరు అక్కడున్న వారిని కలిచివేసింది. భోజన్నను 108లో నిర్మల్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ చనిపోయాడు. అంధుడైన ప్రవీణ్‌ను నిత్యం చేయి పట్టుకుని కార్యాలయానికి తీసుకువచ్చే తండ్రి భోజన్న రోడ్డు ప్రమాదంలో మరణించిన ఘటన స్థానికులను కంటతడి పెట్టించింది. భోజన్నకు కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ద్విచక్ర వాహనదారుడి కోసం పోలీసులు గాలింపు చేపట్టారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సందీప్ తెలిపారు.



గాయాలపాలైన ఎడ్దూర్ భోజన్న

# బ్యాంకులో రైతుల నిరసన

- హోల్డ్‌లో పెట్టిన డబ్బులు విడుదల చేయాలని డిమాండ్

**ఆదిలాబాద్‌టౌన్:** తమ అకౌంట్లో ఉన్న డబ్బులను బ్యాంక్ అధికారులు హోల్డ్‌లో పెట్టారని ముగ్గురు రైతులు నిరసన చేపట్టారు. పట్టణంలోని ధనలక్ష్మి లాడ్జి వద్ద గల ఎస్బీఐలో మంగళవారం ఆందోళనకు దిగారు. భీంపూర్ మండలంలోని వడూర్‌కు చెందిన మోహన్, తంతోలికి చెందిన నక్కల జగదీశ్, యాపల్‌గూడకు చెందిన మరో రైతుకు సంబంధించి ఎస్బీఐ మెయిన్ బ్రాంచి, మహారాష్ట్ర బ్యాంకుల్లో ఖాతాలు ఉన్నాయి. గతేడాది సీసీఐ ద్వారా పత్తి విక్రయించిన డబ్బులు పోస్టాఫీసులో జమ కాగా, పోస్టల్ పేమెంట్ అధికారి వారికి తెలియకుండా డబ్బులు కాజేసిన విషయం తెలిసిందే. సైబర్‌క్రైమ్ కింద కేసు నమోదైంది. కొన్నిరోజుల తర్వాత రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేశారు. ఢిల్లీకి సంబంధించిన అధికారులు బ్యాంక్‌లో ఉన్న వీరి డబ్బులను హోల్డ్‌లో పెట్టారు. పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోకపోవడంతో బ్యాంక్‌లో నిరసన చేపట్టడంతో అధికారులు ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. సాయంత్రం వరకు హోల్డ్‌లో ఉన్న వారి డబ్బులను తీయించే విధంగా చూస్తామని హామీ ఇచ్చారు. పోలీసులు క్లియరెన్స్ ఇచ్చినప్పటికీ అధికారులు హోల్డ్ తీయకపోవడం పట్ల వారు మండిపడ్డారు. సమస్యను పరిష్కరించేలా చూస్తామని ఎస్బీఐ చీఫ్ మేనేజర్ సత్యనారాయణ హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు.

# భార్యపై హత్యాయత్నం

- అత్త, బంధువులపై కూడా
- ఇంద్రవెల్లిలో ఘటన.. కేసు నమోదు

**ఇంద్రవెల్లి:** భార్యతోపాటు అత్త, బంధువులపై భర్త కత్తులతో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. మండలకేంద్రంలో మంగళవారం ఈ ఘటన చోటు చేసుకుంది. ఎస్సై సునీల్ కథనం ప్రకారం.. మండలకేంద్రానికి చెందిన సంజీవానికి దనోరా(బి) గ్రామానికి చెందిన గుట్టె అంకుష్‌తో వివాహమైంది. ఈ దంపతులకు ఇద్దరు సంతానం. భర్త అంకుష్ గత కొంత కాలంగా భార్యపై అనుమానం పెంచుకున్నాడు. తరచూ ఆమెతో గొడవ పడేవాడు. వారం క్రితం సంజీవణి తల్లిగారింటికి వచ్చి ఉంటోంది. మంగళవారం మధ్యాహ్నం సంజీవాణి ప్రియుడు రాహుల్ అంకుష్‌కు ఫోన్ చేసి నీ భార్యతో ఉన్న ఏం చేస్తావో చేయ్యి..అంటూ చెప్పాడు. అంకుష్ కోపంతో అత్తగారింటికి వచ్చి భార్యపై కత్తితో దాడి చేశాడు. ప్రతిఘటించిన తల్లి కేంద్రే అనిత, అమ్మమ్మ రాధాబాయిలపై దాడి చేయగా వారికి స్వల్ప గాయాలయ్యాయి. తీవ్రగాయాలైన సంజీవాణితోపాటు ఇద్దరిని స్థానికులు మండలకేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. విషయం తెలుసుకున్న ఎస్సై సునీల్ ఆస్పత్రికి చేరుకుని క్షతగాత్రులను 108లో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



తీవ్ర గాయాలైన సంజీవాణి

### ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

**తాంసి:** మద్యం మత్తులో ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై కలీం కథనం ప్రకారం..భీంపూర్ మండలం పిప్పల్‌కోటి గ్రామానికి చెందిన గడ్డం పొచ్చన్న (36) కూలీ పనులు చేస్తూ కుటుంబానికి ఆసరాగా ఉండేవాడు. గత రెండేళ్లుగా మద్యానికి బానిసయ్యాడు. గతేడాది భార్య తల్లిగారింటికి వెళ్లి ఉంటోంది. పొచ్చన్న తల్లిదండ్రులతో కలిసి ఉంటున్నాడు. మద్యం మత్తులో మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై ఘటన స్థలానికి చేరుకుని మృతదేహన్ని పరిశీలించారు. పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. మృతుడి తండ్రి కిష్టన్న ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



పొచ్చన్న (ఫైల్)

**రైలు కిందపడి ఒకరు..**

**మంచిర్యాలక్రైం:** జిల్లా కేంద్రంలోని గోదావరి రైల్వే బ్రిడ్జి సమీపంలో రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ సంపత్‌కుమార్ కథనం ప్రకారం...స్థానిక అశోక్ రోడ్‌కు చెందిన సయ్యద్ జమీర్(27) కూలీ పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. కుటుంబ ఆర్థిక ఇబ్బందుల వల్ల తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. మంగళవారం గుర్తుతెలియని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ తెలిపారు. మృతుడికి భార్య రిజ్వాన, ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు.

**కదిలిలో ఒకరు..**

**దిలావర్‌పూర్:** మండలంలోని మాడేగాం పంచాయతీ అనుబంధ గ్రామమైన కదిలికి చెందిన జగదేకర్ గంగాధర్ (56) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై సందీప్ కథనం ప్రకారం.. గత కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. కుటుంబీకులు మద్యం మానేయాలని ఎంత చెప్పినా వినలేదు. ఈక్రమంలో అనారోగ్యం బారినపడ్డాడు. మంగళవారం కుటుంబీకులు పని నిమిత్తం పంట చేలకు వెళ్లారు. ఈ క్రమంలో ఇంట్లో ఉరేసుకున్నాడు. భార్య శాంతాబాయి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.




గంగాధర్ (ఫైల్)

### విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరి రిమాండ్

**రెబ్బెన:** పోలీసుల విధులకు ఆటంకం కలిగించడంతోపాటు దురుసుగా ప్రవర్తించిన ఇద్దరిని మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..ఈనెల 12న గంగాపూర్ జాతర నేపథ్యంలో పోలీసుస్టేషన్ పరిధిలోని దేవులగూడ సమీపంలో ఎస్బీఐ పాయింట్ వద్ద ట్రాఫిక్ నియంత్రణ, అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా హెడ్ కానిస్టేబుల్ శ్రీకాంత్, కానిస్టేబుల్ సాగర్ విధులు నిర్వహించారు. అదే ప్రాంతంలో రెబ్బెనకు చెందిన మహ్మద్ షాజీం, దేవులగూడకు చెందిన దారావత్ శ్రీకాంత్‌లు గొడవ పడుతుండటంతో గమనించిన పోలీసు సిబ్బంది పరిస్థితిని అదుపు చేసే ప్రయత్నం చేశారు. వారు పోలీసు సిబ్బందిపై దురుసుగా ప్రవర్తించారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

### రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ఇద్దరికి పతకాలు

**మంచిర్యాలటౌన్:** ఓయూలో ఈనెల 18 నుంచి 19వ తేదీ వరకు నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి యూత్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లాకు చెందిన ఇద్దరు అథ్లెటిక్స్‌లకు బంగారు, రజత పతకాలు సాధించారు. 400 మీటర్ల రన్నింగ్‌లో బి.శృతి (గోల్డ్ మెడల్), 110 మీటర్ల హడిల్స్‌లో బి.విష్ణు (సిల్వర్ మెడల్) సాధించినట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రటరీ ఈగం మారయ్య, కోచ్ సంతోశ్, మేనేజర్ శ్రీకాంత్ తెలిపారు.



పతకాలు సాధించిన జిల్లావాసులు

### ఎస్కార్ట్ నుంచి తప్పించుకున్న నిందితుడికి ఏడాది జైలు

**బెల్లంపల్లి:** పోలీసు ఎస్కార్ట్ నుంచి చాకచక్యంగా తప్పించుకున్న నిందితుడికి ఏడాది సాధారణ జైలుశిక్ష విధిస్తూ జ్యూడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ జె.ముకేష్ మంగళవారం తీర్పుచెప్పారు. బెల్లంపల్లి వన్‌టౌన్ ఎస్‌హెచ్‌ఓ ఎన్.దేవయ్య కథనం ప్రకారం.. నెన్నెల మండలం కోనంపేటకు చెందిన నాయిని బాపు.. పది నేరాల్లో నిందితుడిగా ఉన్నాడు. 2024 అక్టోబర్ 16న కుమురంభీం జిల్లా కేంద్రంలోని సబ్ జైలు నుంచి ఇద్దరు పోలీసుల ఎస్కార్ట్‌తో బెల్లంపల్లి జూనియర్ సివిల్ కోర్టుకు తీసుకువచ్చారు. కోర్టులో సాక్షుల బయానా అనంతరం తిరిగి జైలుకు తీసుకెళ్తుండగా కాంటా చౌరస్తా వద్ద బస్సు ఎక్కేక్రమంలో బాపు పోలీసులను బలవంతంగా నెట్టివేసి పారిపోయాడు. ఈఘటనపై ఏఆర్ పోలీసు హెడ్‌కానిస్టేబుల్ నాగరాజు ఫిర్యాదుతో ఎస్‌హెచ్‌ఓ దేవయ్య కేసు దర్యాప్తు చేపట్టారు. నిందితుడి ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టి మరుసటి రోజు పట్టుకుని తిరిగి ఆసిఫాబాద్ సబ్ జైలుకు తరలించారు. ఎస్‌హెచ్‌ఓ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఏపీపీ కె.అజయ్‌కుమార్ ఎనిమిది మంది సాక్షులను ప్రవేశపెట్టి నేరం రుజువుచేశారు. ఈ మేరకు మేజిస్ట్రేట్ తీర్పునిచ్చారు.

### ఇనుపసామగ్రి చోరీకి యత్నించిన వ్యక్తి పట్టివేత

**జైపూర్:** మండలంలోని టీకుమట్ల శివారులో గల శ్రీరాంపూర్ నుంచి ఎస్టీపీపీకి బొగ్గు రవాణా చేసే రైల్వేట్రాక్‌లైన్‌కు సంబంధించిన ఇనుప సామగ్రి చోరీకి యత్నించిన వ్యక్తిని మంగళవారం స్థానికులు పట్టుకున్నారు. శ్రీరాంపూర్‌కు చెందిన ప్రవీణ్‌తోపాటు మరో వ్యక్తి టీకుమట్ల శివారులో రైల్వేపట్టాలను కట్ చేసి, ట్రాక్‌పక్కన పడేసిన ఇనుప సామగ్రిని ఎత్తుకెళ్లే ప్రయత్నం చేశారు. గమనించిన పవర్ ప్లాంటు కార్మికులు, స్థానికులు ప్రవీణ్‌ను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. మరొకరు పరారీలో ఉన్నాడు. ఈమేరకు పోలీసులు విచారణ చేపట్టారు

### అటవీభూమిలో గుడిసెల తొలగింపు



గుడిసెల వద్దకు చేరుకున్న అటవీ సిబ్బంది

**జన్నారం:** అటవీ భూమిలో అక్రమంగా వేసుకున్న గుడిసెలను ఫారెస్టు సిబ్బంది తొలగించారు. వివరాలు ఇలా ఉన్నాయి..జన్నారం రేంజ్‌లోని కిష్టాపూర్ శివారులోని గద్దంగూడ, గొండుగూడ గ్రామాల సమీపంలో కంపార్టుమెంట్ నంబర్ 308లో కొన్నినెలల క్రితం కొందరు గిరిజనులు, గిరిజనేతరులు గుడిసెలు వేసుకున్నారు. పక్కనే కొంత భూమిని సాగు చేసుకున్నారు. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లింది. వారి ఆదేశాల మేరకు మంగళవారం తెల్లవారు జామున 3 గంటలకు జన్నారం, ఇందన్‌పల్లి అటవీరేంజ్ అధికారులు సుష్మారావు, కారం శ్రీనివాస్, సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకున్నారు. జేసీబీతో గుడిసెలను తొలగించి నేలమట్టం చేశారు. గుడిసెలకు వేసుకున్న కర్రను డివిజన్‌కు తరలించారు. పలుమార్లు చెప్పిన వినకపోవడంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో గుడిసెలను తొలగించినట్లు రేంజ్ అధికారులు తెలిపారు. ఏళ్లుగా ఉంటున్న మా గుడిసెలను అన్యాయంగా తొలగించారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# ఇస్కాన్ పేరిట రియల్ వ్యాపారం

- సిస్కో ఇన్‌ఫ్రా డెవలపర్స్‌తోపాటు ఒకరిపై కేసు

**భీమారం:** మండల కేంద్రంలో ఇస్కాన్ సంస్థ పేరిట రియల్ వ్యాపారం చేస్తున్న సిస్కో ఇన్‌ఫ్రా డెవలపర్స్‌తోపాటు ఒకరిపై కేసు నమోదు చేసినట్లు జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఇస్కాన్ సంస్థ లోగోని వాడుకుంటూ భీమారంలో సిస్కో ఇన్‌ఫ్రా డెవలపర్స్ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తోందని ఇస్కాన్ జనరల్ మేనేజర్ హనుమాన్ విజయదాసు ఫిర్యాదు చేశారు. ఈమేరకు సిస్కో ఇన్‌ఫ్రా డెవలపర్స్‌తోపాటు హరికృష్ణ సంకీర్త్ మందిర్ నిర్వాహకుడు చంద్రదాసుపై కేసు నమోదైంది. వారికి నోటీసులు జారీ చేసి విచారణకి హాజరు కావాలని కోరనున్నట్లు ఏసీపీ తెలిపారు. ప్రభుత్వ అనుమతులు ఉన్న వెంచర్‌లోనే ప్రజలు ప్లాట్లు కొనుగోలు చేయాలని సూచించారు. సమావేశంలో శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్, ఎస్సై శ్వేత తదితరులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ వెంకటేశ్వర్లు

# బావను కత్తితో పొడిచి చంపిన బామ్మర్ది

- రుయ్యాడిలో ఘటన
- పరారీలో నిందితుడు
- దర్యాప్తు చేస్తున్న పోలీసులు

**తలమడుగు:** మండలంలోని రుయ్యాడి గ్రామంలో కత్తిపోట్ల ఘటన కలకలం రేపింది. బామ్మర్ది కత్తితో బావ ఛాతీలో పొడవగా తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ మండలం తంతోలి గ్రామానికి చెందిన కోక్కురు మహేందర్ (40), తలమడుగు మండలం రుయ్యాడికి చెందిన నవనీతతో 15 ఏళ్ల క్రితం పెళ్లయింది. ఈ దంపతులకు కుమారుడు రాఘవేంద్ర, కుమార్తె దేవిక ఉన్నారు. 13 ఏళ్ల క్రితం బతుకుదెరువు కోసం కుటుంబంతో కలిసి రుయ్యాడి గ్రామానికి వలసవెళ్లాడు. ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. భర్త వేరే మహిళతో సన్నిహితంగా ఉంటున్నాడని నెల రోజులుగా దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ విషయాన్ని భార్య కుటుంబ సభ్యులకు చెప్పింది. మంగళవారం మహేందర్ అతని బామ్మర్ది కుర్మా అశోక్‌లు ఘర్షణ పడ్డారు. మాటమాట పెరగడంతో అశోక్ కత్తితో మహేందర్ ఛాతీలో పొడిచాడు. తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు అందించిన సమాచారంతో రూరల్ సీఐ ఫణిందర్, తాంసి ఎస్సై రాధిక సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. మృతుడి తమ్ముడు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలిస్తున్నట్లు పేర్కొన్నారు.



మహేందర్ (ఫైల్)

### అనాథ మహిళ మృతి

**మందమర్రిరూరల్:** పట్టణంలోని పాతబస్టాండ్ ప్రాంతంలో మతిస్థిమితం లేని అనాథ వృద్ధురాలిని గతేడాది డిసెంబర్ 9న అమ్మ స్వచ్ఛంద సంస్థ సహకారంతో ఏఎస్సై శ్రీనివాస్ మంచిర్యాల కల్వరీ యు వశక్తి అనాథ వృద్ధుల, మానసిక వికలాంగుల ఆశ్రమంలో చేర్పించారు. జనవరి 23న ఆమె అనారోగ్యంతో ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందు తూ మంగళవారం మృతి చెందిందని మందమర్రి ఎస్సై రాజశేఖర్ తెలిపారు. వృద్ధురాలి మృతదేహం మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీలో భద్రపర్చినట్లు పేర్కొన్నారు. ఎవరికైనా వివరాలు తెలిస్తే పోలీసులను సంప్రదించాలని సూచించారు.



### కారు, బైక్ ఢీ: ఒకరు మృతి

**నిర్మల్‌రూరల్:** ఆగి ఉన్న బైక్‌ను అతివేగంగా వచ్చిన కారు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందినట్లు రూరల్ ఎస్సై లింబాద్రి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మామడ మండలం కిషన్‌రావుపేటకు చెందిన ఆత్మారం(55), కుమారుడు శ్రీకాంత్ బైక్‌పై మంగళవారం నిర్మల్ మండలం భాగ్యనగర్ సమీపంలో గల యూటర్న్ వద్ద ఆగారు. అక్కడే తండ్రి కుమారుడు మాట్లాడుతుండగా ఆర్మూర్ వైపు నుంచి అతివేగంగా వచ్చిన కారు వెనుక నుంచి వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తండ్రి కుమారుడికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వారిని అంబులెన్స్‌లో జిల్లా కేంద్రంలోని ఏరియాస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించగా ఆత్మారాం అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ ప్రమాదంలో బైకు, కారు దెబ్బతిన్నాయి. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### ఒకరికి మూడేళ్ల జైలు

**కాసిపేట:** చీటింగ్ కేసులో ఒకరికి మూడేళ్ల జైలుశిక్ష విధిస్తూ బెల్లంపల్లి జ్యూడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ముకేష్ మంగళవారం తీర్పునిచ్చారు. దేవా పూర్ ఎస్సై అంజనేయులు కథనం ప్రకారం ..2023 లో కుమురం భీం జిల్లా దహెగాం మండలం కల్వడ ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలో కాంట్రాక్టు టీచర్‌గా నాయిని బాపు పనిచేసేవాడు. కాసిపేటమండలం పల్లంగూడ, గోండుగూడ గ్రామాల్లో ప్రజలకు ఆ యుష్మాన్ భారత్ పేరిట కార్డులు ఇప్పిస్తానని నమ్మబలికాడు. మిషన్ ద్వారా వేలుముద్రలు తీసుకుని వారి ఖాతాల్లో నగదును ఆయన ఖాతాలోకి మళ్లించుకున్నాడు. ఈ విషయమై పోలీసుస్టేషన్ పరిధిలో మూడు కేసులు నమోదైంది. మంగళవారం బెల్లంపల్లి కోర్టులో ఏపీపీ అజయ్‌కుమార్ సాక్షులను విచారించి నేరం రుజువు చేశారు. నిందితుడికి మూడేళ్ల జైలుశిక్షతోపాటు కేసుకు రూ.వెయ్యి చొప్పున రూ.3 వేలు జరిమానా విధిస్తూ మేజిస్ట్రేట్ తీర్పుచెప్పారు.

### రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్

**ఆదిలాబాద్‌టౌన్(జైనథ్):** అక్రమంగా ఇసుక రవాణా చేస్తుండగా రెండు ట్రాక్టర్లను పట్టుకుని సీజ్ చేసినట్లు జైనథ్ సీఐ సాయినాథ్ తెలిపారు. పక్కా సమాచారంతో జైనథ్ మండలంలోని పెన్‌గంగా నది గ్రామ శివారులో ఎస్సై వి.పురుషోత్తం, ఏఎస్సై ఆత్మారాం, సిబ్బందితో కలిసి మంగళవారం తనిఖీలు చేపట్టినట్లు పేర్కొన్నారు. రెండు ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తుండగా సీజ్‌చేసి స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. డీఎస్పీ జీవన్‌రెడ్డి ఆదేశాల మేరకు కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.